జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి - పార్వతీపురం

వివిధ కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మరో వారం రోజుల గడువు కేటాయిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుండి ఈనెల 26 వరకు అర్హులైన జర్నలిస్టుల నుంచి వెబ్ సైట్ లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 6 జనవరి, 2024 వరకు అంటే నిర్ణీత గడువులోగా ఆన్ లైన్ లో తమ వివరాలను నమోదు చేసుకోని వారికి, నమోదు చేసుకున్నా సబ్మిట్ కొట్టని వారికి ఆయా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు.

శంఖారావంలోనూ తేలని లెక్క

- తెలుగు తమ్ముళ్లలో గందరగోళం
- ఆశావహులకూ తప్పని ప్రయాస
- దగ్గర పడుతున్న ఎన్నికలు



టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ జిల్లాలో పూరించిన శంఖారావంలో ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరనేది కొంతలో కొంతైనా స్పష్టత వస్తుందని ఆశించిన తెలుగు తమ్ముళ్లు ఒకింత అయోమయానికి, గందరగోళానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే కావాలన్న ఆశావహులకు కూడా ప్రయాస తప్పలేదు. మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పార్టీ అభిమానులతోపాటు ప్రజలు కూడా పోటీకి ఎవరికి అవకాశం దక్కుతుందా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చాలా చోట్ల బహు నాయకత్వం, గ్రూపుల పోరు ఉండడమే ఇందుకు కారణం.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోకేష్ శంఖారావం సభలు జరిగిన సంగతి తెలిసిందే. కొన్నిచోట్ల తెలుగు తమ్ముళ్లు అత్యంత ఉత్సాహంగా సభలకు హాజరు కాగా, పాలకొండ, బొబ్బిలి, సాలూరు, విజయనగరం తదితర నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సభలు చివరి వరకు జనం లేకపోవడంతో వెలవెలబోయాయి. దీంతో ప్రాంగణాలు నిండేవరకు లోకేష్ అక్కడే నిరీక్షించి, అనంతరం వేదికపైకి వచ్చి మాట్లాడాల్సి వచ్చింది. అంతమాత్రాన ఆయా నియోజకవర్గాల్లో సభకు కూడా హాజరు కాలేనంత తక్కువ కేడర్ ఉందని చెప్పలేం. వారిని సమయానికి రప్పించడంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయకులు విఫలమయ్యారని చెప్పుకోవచ్చు. గజపతినగరం, రాజాం, చీపురుపల్లి తదితర సభల్లో జనం పోటెత్తారు. ఈ సంగతి కాస్త అటుంచితే... ఓవైపు ఎన్నికలు దగ్గర పడుతుండడం, మరోవైపు ఎక్కువ నియోజకవర్గాల్లో గ్రూపులపోరు తారా స్థాయికి చేరుకుంది. దీంతో లోకేష్ చేపట్టిన శంఖారావం సభల్లో అభ్యర్థులను ప్రకటించకున్నా... పార్టీ కేడర్‌కు పరోక్షంగా సంకేతాలు ఇస్తారనే చర్చ ముందస్తుగా సాగింది. అటువంటి పరిణామాలేవీ శంఖారావం సభల్లో కనిపించలేదు. దాదాపు అన్ని చోట్లా పార్టీ ఇన్‌ఛార్జులు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యేలు, ఇతర పెద్దలను కూడా కూర్చోబెట్టారు. దాదాపు అన్ని చోట్లా పార్టీ నాయకులందర్నీ కలుపుకునే రీతిలోనే లోకేష్ ప్రసంగం గానీ, పలకరింపు తీరు గానీ కనిపించింది. అయినా, ఎన్నికల గుర్రం ఎవరనేది ఊహకు కూడా అందనివ్వక పోవడంతో దాదాపు అన్ని గ్రూపుల్లోనూ నిస్తేజం కనిపిస్తోంది.

విజయనగరం నియోజకవర్గంలో పూసపాటి అశోక్ గజపతి గానీ, ఆయన కుమార్తె, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి గానీ.. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరు ప్రస్తావించడానికి కూడా ఇష్టపడలేదు. లోకేష్ మాట్లాడినప్పుడు గీత హయాంలో అభివృద్ధి జరిగిందని కితాబిచ్చారు. విజయనగరం అసెంబ్లీ స్థానాన్ని అశోక్ లేదా ఆయన కుమార్తె పంచుకున్నట్టుగా వ్యవహరిస్తే బిసికి చెందిన గీత పరిస్థితి ఏమిటో? అంటూ చాలా వరకు చర్చ నడుస్తున్నప్పటికీ క్లారిటీ ఇవ్వలేదు. చీపురుపల్లిలో మంత్రి బొత్సను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతో ధీటైన అభ్యర్థిని రంగంలోకి దింపుతారని పార్టీ నాయకుల్లో సైతం ప్రచారం జరుగుతోంది. కానీ, శంఖారావం సభలో కిమిడి నాగార్జునకు మించిన నాయకులెవరూ కనిపించలేదు. నెల్లిమర్ల స్థానం టిడిపికా, జనసేనకా అన్న సందేహం ఇరు పార్టీల కేడర్‌నీ వీడలేదు. శృంగవరపుకోటలో సీటు కోసం స్థానిక మాజీ ఎమ్మెల్యే, మరో నేత గొంప కృష్ణ పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో శంఖారావం సభలో ఇరు గ్రూపులకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, స్థానిక నాయకుడు కరణం శివరామకృష్ణతోపాటు కొద్దికాలంగా సీటు ఆశిస్తున్న కె.ఎ.నాయుడు అన్న కుమారుడు శ్రీనివాసరావుకు కూడా సభలో పాల్గొనే అవకాశం కల్పించారు. దీంతో, అభ్యర్థి ఎవరు? అనే సందేహం యథాతథంగానే ఉండిపోయింది. సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

ప్రతిభా భారతి గైర్హాజరు వెనుక ఆంతర్యమేమిటో?

రాజాం నియోజకవర్గంలో మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ గైర్హాజరు కావడం పట్ల సర్వత్రా చర్చ నడుస్తోంది. కొన్నాళ్ల క్రితమే పార్టీలోని ఓ రాష్ట్ర నాయకుడి కనుసన్నల్లో ప్రతిభా భారతి ఆధ్వర్యాన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోండ్రు మురళికి వ్యతిరేకంగా నాలుగు మండలాలకు చెందిన నాయకులు రహస్య సమావేశమయ్యారు. ఆ సమావేశంలో పాల్గొన్న మండల నాయకులు హాజరైనప్పటికీ ప్రతిభా భారతి, గ్రీష్మ హాజరు కాకపోవడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా ఉంది.

స్పందనకు 167 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 167 వినతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అర్జీదారుల నుంచి వచ్చే దరఖాస్తులపై సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి, వివరాలు తెలుసుకొని, సమస్యల పరిష్కారానికి ఆదేశాలు, సూచనలు చేశారు. ఇన్‌ఛార్జి జాయింటు కలెక్టరు సి.విష్ణుచరణ్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత ప్రజల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన వినతుల్లో కొన్ని....

బలిజిపేట మండలం నారన్నయుడువలసలో ఎస్సీ కాలనీ వాసులకు ప్రభుత్వం వారు కొంత భూమిని నివాస స్థలాల కోసం ఇచ్చి ఉన్నారని, ఆ నివాస స్థలాలన్ని వేరేవారు దౌర్జన్యం చేసి ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వి. రామప్పడు దరఖాస్తు అందజేశాడు.

కొమరాడ మండలం మార్కొండపుట్టికి అదనంగా ఒక అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ జె.ఇందిరమ్మ, గ్రామస్తులు కోరారు. సాలూరు మండలం దండిగాంలో 20 కుటుంబాలు నివాసముంటున్నామని, సర్వేనెంబర్ 1లో సుమారు 20 ఎకరాల భూమి ఫారెస్ట్ భూముల్లో కలిసిపోయిందని, ఆ భూమిని తిరిగి తమ రెవెన్యూ పరిధిలోకి తీసుకొచ్చి తమకు సాగు చేసేందుకు అవకాశం కల్పించాలని పి.చిరంజీవి, ఇతరులు వినతి పత్రం సమర్పించారు. బలిజిపేట మండలం వెంగాపురానికి చెందిన కె.దేవిచరణ్ సర్వే నంబర్ 66-16, పలగర రెవెన్యూలోని మెట్టు 0.95 సెంట్లు భూమిలో కొంత భాగం ఆక్రమణకు గురైందని అర్జీ అందజేశారు. బలిజిపేట మండలం చాకరాపల్లి గ్రామానికి చెందిన మజ్జి సింహాద్రి నాయుడు బోరు బావికి కరెంట్ లైన్ ఇప్పించాలని కోరారు. గరుగుబిల్లి మండలం బొత్సవలసకు చెందిన టి.జగన్నాథ రావు సర్వేనెంబర్ 36-20లో 26 సెంట్లు భూమికి 1బి మంజూరు చేయాలని కోరారు. మక్కువ మండలం శంబరకు చెందిన వి.పోలినాయుడు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. వీరఘట్టం మండలం నడుకూరుకు చెందిన బి.సీతాలక్ష్మి హౌస్ ఓల్డ్ మ్యాపింగ్‌లో వేరు చేసి వితంతు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి బి.జగన్నాథరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిఇఒ పగడాలమ్మ, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కష్ణ, డ్వామా పీడీ రామచంద్రరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సీతంపేట ఐటిడిఎలో...

సీతంపేట : తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు గిరిజనులు విన్నవించారు. స్పందన కార్యక్రమం ఎపిఒ రోసిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐటిడిఎలో నిర్వహించారు. గాదిలంక చెందిన జీవన్ కుమార్ సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. గుర్రాలమెట్టకు చెందిన రాజారావు సిఆర్‌టి పోస్ట్ ఇప్పించాలని విన్నవించారు. పెద్దరాజపురానికి చెందిన మహేష్ రైస్ మిల్ మంజూరు చేయాలని కోరారు. గేదెలగూడకు చెందిన చిన్నారావు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు. కేరాసింగి గూడకు చెందిన సోమయ్య తాగునీరు సమస్య పరిష్కరించాలని కోరారు. జామితోట చెందిన రమణమ్మ వితంతు, పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు. పింగువాడకు చెందిన సూరయ్య వరిపంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయపార్వతి, పిఎఒ హరికృష్ణ, పిహెచ్‌ఒ గణేష్, సిడిపిఒ రంగలక్ష్మి, డిఇ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరీక్షిస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

జిల్లా కేంద్రాసుపత్రి సేవలు సంతృప్తికరం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన జిల్లా ఆసుపత్రిలో జనరల్ వార్డుతో పాటు మహిళా, నవజాత శిశు వార్డులు, ఇతర విభాగాల్లో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తులతో మాట్లాడి వైద్య సేవల పట్ల ఆరా తీశారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో వివిధ పరిస్థితుల దష్ట్యా కొన్ని సమస్యలు ఉంటాయని వాటిని పరిష్కరించాల్సి ఉందన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులు మృతి పట్ల చైర్మన్ స్పందిస్తూ ఐటిడిఎ అధికారులు వీటిపై దృష్టి సారించాలన్నారు. వాటిపై నివేదికలు తెప్పించడం, పర్యవేక్షణ ఎక్కువ చేయడం, ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు చేయడం ద్వారా మరణాల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. అంబులెన్సు అవసరం ఉందని ఆసుపత్రి అధికారులు తెలిపారని, దీనిపై ఐటిడిఎ పిఒతో మాట్లాడతామని ఆయన స్పష్టం చేశారు. నవజాత శిశు కేంద్రంలో ఉత్తమ శ్రేణి వైద్య సేవలు అందుతున్నాయని ప్రశంసించారు. అందరూ సమష్టిగా ఆరోగ్య సమాజం కోసం కషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.బి వాగ్దేవి, జిల్లా గిరిజన సంక్షేమ,సాధికారత అధికారి ఎం రుక్మాంగదయ్య, ఒటిడబ్ల్యుఒ కె శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలోని నూతన విద్యాశాఖ అధికారి పగడాలమ్మను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలక దేవానంద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో పనిచేస్తున్న పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఏజెన్సీ అలవెన్సులు అందడం లేదని, సిగ్నల్స్ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో యాప్‌లు పనిచేయడం లేదని వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నారాయణరావు అర్బన్ సెక్రటరీ మోస్ ఉన్నారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా గుర్తించాలి

ప్రజాశక్తి -బెలగాం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న 1560 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని, రూ.10వేలు వేతనాలు చెల్లించాలి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లు స్థానిక ఐటిడిఎ వద్ద సోమవారం మహాధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ ఐటిడిఎల పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, ఆశాలతో సమానంగా10 వేలు వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని, 2018 ఏప్రిల్ నుండి 2019 నవంబర్ వరకు 974 మంది సిహెచ్‌డబ్ల్యులకుపాత బకాయిలు రూ. 81,81600 తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి అనేకమంది డిఎంహెచ్‌ఒలు, ఎఐటిడిఎ పిఒలు, ఎపిఒలు మారినా తమ సమస్య పరిష్కారం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తింపు కార్డులు, యూనిఫాం లేకపోవడంతో విజయనగరం ఘోసాసుపత్రికి రోగులకు తీసుకెళ్తే తమను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో కనీసం 5 రోజులు ఉండాల్సి వస్తుందన్నారు. కనీసం వాష్, రెస్ట్ రూమ్‌లు కూడా లేవన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇస్తామని చెబుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, అందువల్లే ఈరోజున స్థానిక ఐటిడిఎని ముట్టడించామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్‌ఒ, ఎపిఒ వారి పరిధిలో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కారం చేస్తామని, మిగతా సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ. సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు. కొల్లి సాంబ మూర్తి, పలువురు కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు

పార్వతీపురం ఐటిడిఎ వద్ద ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

సీతంపేట: స్థానిక ఐటిడిఎ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు మహాధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు మాట్లాడుతూ ఐటిడిఎల పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, ఆశాలతో సమానంగా వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, డిఎలు, యూనిఫాం ఇవ్వాలన్నారు. రూ.10లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ డిప్యూటి డిఎంహెచ్‌ఒ విజయపార్వతికి, ఎపిఒ రోషి రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సురేష్ ఎం.కాంతారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, ఎన్.అప్పన్న కె.భాస్కరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయుకులు ఎస్.మాలతి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయుకులు హైమావతి, ఎస్.రమణమ్మ, కళావతి, జ్యోతి, బి.కమల తదితరులు పాల్గొన్నారు.



సీతంపేటలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు వినతిని అందజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

రూపాయి ఖర్చుతో పేదలకు ఇళ్లు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పేదలకు ఒక రూపాయి ఖర్చుతో సొంత ఇంటిని మంగళవారం అందజేయనున్నట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నాళ్లుగానో వేచిచూస్తున్న లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇంటిని గతంలో టిడిపి ప్రభుత్వం రూ.12లక్షలకు అందజేయాలని నిర్ణయించిందని చెప్పారు. అయితే సిఎం జగన్‌మోహన్ పేదలపై ఆర్థిక భారం పడకుండా కేవలం రూపాయి ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేస్తూ పత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించారని చెప్పారు. టిడ్కో గృహ సముదాయాల ప్రదేశంలో నిర్వహించనున్న కార్యక్రమంలో లబ్దిదారులకు సొంత ఇంటి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి లబ్దిదారులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరు కావాలని కోరారు. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరతారని రాజన్నదొర చెప్పారు.

3న పల్స్ పోలియో

ప్రజాశక్తి - పార్వతీపురం

మార్చి3 న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు సోమవారం పల్స్ పోలియో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎంఒ డాక్టర్ జాన్ జూడ్ జోషువా పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ మార్చి 3న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలను వారి పరిధిలోనే వైద్య సిబ్బంది వేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 98,991 మంది ఐదేళ్లలోపు పిల్లలకు 905 పోలియో బూత్ కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నట్టు తెలిపారు. 41మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేసి బయట ఉండే పిల్లలకు వేస్తారని, బస్టాండ్, రైల్వే స్టేషన్లులో కలుపుకొని 17 ట్రాన్సిట్ కేంద్రాల్లో ప్రయాణాల్లో ఉండే పిల్లలకు వేయనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి కార్యచరణ సిద్ధం చేయడం జరుగుతుందని అన్నారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశాలు నిర్వహించి కార్యక్రమం విజయవంతమయ్యేందుకు అవసరమైన కార్యాచరణ చేయాలన్నారు. కరపత్రాలు, పోస్టర్లు, టామ్ టామ్, మీడియా ద్వారా పల్స్ పోలియో గురించి ప్రజలకు చేరువయ్యేలా దష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ నారాయణరావు, జిల్లా ఆర్ బిఎస్ కె అధికారి డాక్టర్ డి. భాస్కరరావు, డిఎంఒ డాక్టర్ టి.జగన్ మోహనరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శివకుమార్, ఎఫ్ డిపి ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, ఎస్‌ఒ శంకర్, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేకతను తట్టుకోలేక మీడియాపై దాడులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసిపి నాయకులు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పార్వతీపురంమన్యం జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ విలేకరుల సంఘం నాయకులు అన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి, అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలు అక్షర బద్ధం చేయడం, ఫోటోలో బంధించడం వారి విధుల్లో ముఖ్య భాగమని, ప్రజాస్వామ్య విలువలను కాలరాసే రాజకీయ పార్టీలపై సహజంగానే ప్రజలు యావగించుకుంటారని, దీన్ని హుందాగా రాజకీయ పార్టీలు స్వీకరించలేక విలేకరులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా విలేకరులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే వారి రక్షణ కోసం ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయాలని, బాధిత జర్నలిస్ట్ కృష్ణను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సాలూరు: అనంతపురం జిల్లా రాప్తాడులో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు పై దాడిని ఖండిస్తూ స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు మండల తహశీల్దార్ కార్యాలయంలో హెచ్‌డిటి రంగారావుకు వినతిపత్రం అందజేశారు. వార్తా సేకరణలో భాగంగా ఫొటోలు తీస్తున్న జర్నలిస్టుపై విచక్షణారహితంగా సామూహిక దాడి చేయడం అన్యాయమని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాచిపెంట : అనంతపురం జిల్లా రాప్తాడులో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిని నిరసిస్తూ మండల విలేకరులు స్థానిక తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జె ఉదయ్ కుమార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు సిహెచ్ వెంకటరమణ, జి.వెంకట రాజు, నల్లి గోవిందరావు, వై.గౌరీశ్వరరావు, ఎ.రమేష్, పి.వెంకటరమణ, పి.ఉమామహేశ్వరరావు, ఎస్ఆర్‌టిపి రాజు, ఎల్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాత్రికేయులు

సిపిఎం ఖండన

పార్వతీపురంరూరల్ అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసిపి కార్యకర్తల దాడిని ఖండిస్తున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.. జర్నలిస్టు ఫొటోలు తీయడం నిషిద్ధమా, నేరమా అని నిలదీశారు. ఇది మీడియాపై అధికార పక్షం చేసిన ఫ్యాక్షన్ దాడి అని మండిపడ్డారు. ఒక పత్రిక, ఛానెల్ యజమాని అయిన సిఎం ఇటువంటి దాడులు ప్రోత్సహించడం, తగదని అన్నారు.

సచివాలయ వ్యవస్థతోనే ప్రజల వద్దకు పాలన

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామ స్వరాజ్య పాలన సచివాలయం వ్యవస్థ ద్వారానే ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పెదభోగిలి పంచాయతీ పరిధిలో రెండో సచివాలయం భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు. గ్రామంలో వందల మీటర్లు సీసీ కాలువలు, రోడ్లతో పాటు నాడు-నేడు ద్వారా పాఠశాలను అభివద్ధి చేశామన్నారు. గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, మండలపార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎఒ ప్రసాద్, ఎంపిటిసిలు బురిడి కుసుమ సూర్యనారాయణ, సురగాల గౌరీకిరణ్, సర్పంచ్ తెరేజమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు సాకేటి కుర్మారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ 1, 2 ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి శ్రీకాకుళం జిల్లా రాగోలు జేమ్స్ హాస్పిటల్ వైద్యులు డి. దీపిక (గైనిక్), వై భవ్య (గైనిక్) హాజరై 148మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా స్త్రీలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే చర్మవ్యాధులు, కంటికి సంబంధించిన అనేక సమస్యలను గుర్తించారు. ఆరోగ్య పరీక్షలు అనంతరం ప్రిన్సిపల్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వివిధ ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేమ్స్ హాస్పిటల్ ఏరియా కో-ఆర్డినేటర్ కె.రమేష్, కె.విజయ, ఎన్ఎస్ఎస్ పిఒ రామయ్య, త్రినాధ, ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ డి.శ్రీలక్ష్మి, వి.కల్పన, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో అభివృద్ధి పనులు చేపట్టండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ నెహ్రూ విజబుల్ మార్కెట్‌లో ఉన్న చేపల విక్రయ దుకాణాల సముదాయంలో త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలంకు సూచించారు. సోమవారం మున్సిపల్ అధికారులను కలిసి మార్కెట్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. చేపల మార్కెట్ వ్యాపారులు మార్కెట్లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఎమ్మెల్యే స్పందించి చేపల మార్కెట్లో త్వరితగతిన అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చంద్రబాబు పాలనలోనే యువతకు ఉపాధి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో యువత అభివృద్ధి చెందాలన్నా, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా టిడిపితోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. సోమవారం కృష్ణపల్లిలో గల తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలకు ముందు ఏటా జాబ్ క్యాలెండర్ వేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని యువతకు అండగా నిలుస్తామని హామీలు ఇచ్చి, వాటిని ఏమాత్రం పట్టించుకోక యువతను మోసగించారన్నారు. కార్పొరేషన్ ద్వారా యువతకు అందాల్సిన స్వయం ఉపాధి, సబ్సిడీ రుణాల ఊసే లేకుండా పోయిందన్నారు. మరోసారి అధికారం కోసం అబద్ధాల హామీలతో యువతను మోసగించేందుకు వైసిపి పెద్దలు సిద్ధపడుతున్నారని మండిపడ్డారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన టిడిపికే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో యువత అంతా టిడిపి వైపే నిలుస్తుందన్నారు. ఇదే విషయాలను యువత గ్రామ గ్రామాన ఇంటింటా తిరిగి ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని అన్నారు.

జనసేనలోకి వైసిపి కోవర్టులు

ప్రజాశక్తి - మక్కువ

నియోజకవర్గంలో జనసేన బలపడుతున్న తరుణంలో వైసిపి కోవర్టులు తమ పార్టీలో అలజడులు సృష్టించి జనసేనలో చీలికలు తెచ్చేలా కుట్ర పన్నుతున్నారని, వారి కుట్రలను ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వమని జనసేన పార్టీ సమన్వయకర్త రిషి వర్దన్, నాయకులు మీసాల నవీన్ తెలిపారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. మండలంలో జనసేన మండల కమిటీ ఏర్పాటు చేశామని, మరికొన్ని రోజుల్లో మండల కేంద్రంలో పార్టీ ఆఫీసును ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. అయితే ఇటీవల తమ పార్టీలోకి వైసిపి కోవర్టులు చేరి పార్టీలో చీలికలు తెచ్చేందుకు పాల్పడుతున్నారని, వీరి దుశ్చర్యలను తిప్పికొట్టడానికి జనసైనికులు అంతా బలంగా ఉన్నామని తెలిపారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఎవరినైతే అభ్యర్థులను ప్రకటిస్తుందో వారిని గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని లిడికివలసలో తక్షణమే వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని గిరిజన సమస్యల సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు, చందు తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిడికివలస గిరిజన గ్రామంలో ప్రతి ఇంట్లో జ్వరం, విరోచనాలు, ఇతర అనారోగ్య సమస్యలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే మక్కువ మండలం ఎర్రసామంత వలస గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి అశోక్ మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని, ఎఎన్ఎంలను నియమించాలని పిఒను కోరారు. లిడికివలసలో చెరువుల హద్దులు గుర్తించి, చెరువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన పిఒ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగన్నాధరావును పిలిపించి లిడికివలస గ్రామ గిరిజనులకు తక్షణమే వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిరసన తెలుపుతున్న వికలాంగులు

సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ పట్టణంలోని దివ్యాం గులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాల యం వద్ద ధర్నా నిర్వహిం చారు. మదర్ థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జిల్లెల్ల సీతారాం ఆధ్వర్యాన వారు కోటవీధి నుంచి ర్యాలీ చేసుకుంటూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పట్టణంలోని వికలాంగులపై సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, రైల్వే పాసులు జారీ చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ సిబ్బందికి వినతిని అందజేశారు.

స్కూల్‌కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న ఎంఇఒ చంద్రశేఖర్

స్కూల్ కాంప్లెక్స్ నిబంధనలు ఆచరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధ్యాయులంతా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిబంధనలను తప్పనిసరిగా ఆచరించి సమావేశాలను పూర్తి చేయాలని ఎంఇఒ-1 బి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని కొత్తగూడ, దుడ్డుఖల్లు లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు చేశారు. ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన ఐఎఫ్‌బి చానల్స్ ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో బోధించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే విద్యార్థులకు అర్థమయ్యేలా వినూత్న పద్ధతుల్లో బోధించేందుకు ప్రణాళికలను పాఠశాల సముదాయాల్లో రూపొందించాలని అన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా వర్క్ బుక్‌లను కరెక్షన్ చేసి, నూతన పాఠ్యాంశాలపై తర్ఫీదు ఇవ్వాలని కోరారు. అలాగే నాడు-నేడు పాఠశాలల ఉపాధ్యాయులు తమకు నిర్దేశించిన మేరకు పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని అన్నారు. అలాగే పాఠశాల సముదాయాలకు నిర్దేశించిన సమయాల్లో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

గుంప సోమేశ్వరస్వామి దేవాలయానికి ఇన్వెర్టర్ వితరణ

ప్రజాశక్తి - కొమరాడ

నాగావళి, జంఝావతి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు ఇన్వెర్టర్ వితరణ చేసినట్లు సర్పంచ్ సుంకరి సుగుణ తెలిపారు. సోమవారం ఆలయం వద్దకు కొత్తకోట మల్లికార్జునరావు, చంద్రకళ దంపతులు ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయానికి అవసరమైన కొత్త ఇన్వెర్టర్లు వితరణ చేసి అభివృద్ధికి సహకరించినట్లు తెలిపారు. ఎప్పటికే అభివృద్ధికి కాపారపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాయతీ తరపున విరాళాలు సేకరించి అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఎంతో ప్రతిష్టిగాంచిన ఈ ఆలయం అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ఇన్వెర్టర్ వితరణ చేసిన దంపతులతో పాటు కాపారపు ఫౌండేషన్, ఆలయ అభివృద్ధి కమిటీ,కోటిపాము పంచాయతీ తరుపున సర్పంచ్ వారికే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు ప్రజాప్రతినిధులు సహకరించాలి

ప్రజాశక్తి - కురుపాం

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రజా ప్రతినిధులు అధికారులకు సహకరించి ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూడాలని ఆర్‌డిఒ వివి రమణ కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గల ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎన్నికల నిర్వహణపై జరిగే సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా శిథిలావస్థలో ఉన్న పోలింగ్ స్టేషన్లుంటే వాటి స్థానంలో వేరే దగ్గర పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు గుర్తించాలని కోరారు. అలాగే అన్ని పోలింగ్ స్టేషన్లో ఓటర్లు, వృద్ధులు మౌలిక వసతులకు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు సక్రమంగా ఉండేలా అధికారులు చొరవ తీసుకొని ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐదు మండలాలు తహశీల్దార్లు, ప్రజా ప్రతినిధులు, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె. మల్లేశ్వరరావు, టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, పోలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలి

వాలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని ఆర్‌డిఒ రమణకు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు వాలంటీర్లను ఎన్నికల ప్రక్రియకులో దూరంగా ఉంచాలని, సొంత గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారిని ఎన్నికల విధుల నుంచి పక్క మండలంలో ఎన్నికల విధుల్లోకి మార్చాలని, ఆన్ లైన్లో ఫారం-6 చేర్పులను త్వరగా పరిశీలించాలని కోరారు. అలాగే మరణించిన, డబల్ ఎంట్రీ ఉన్న ఓటర్లను తొలగించి ఫారం -8 సవరలను సరిచేయమని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేష్, టిడిపి మండల కన్వీనర్లు కెవి కొండయ్య, శేఖర్ పాత్రుడు, పోలూరు శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు నడుకూరు దులికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రమణ

తక్షణమే సంక్షేమ ఫలాలు

మంత్రి బొత్స • రాజాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజాం

అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి, వాటి ఫలాలను తక్షణం అందించడమే తమ ప్రభుత్వ విధానమని విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాజాం పట్టణంలోని ఆదర్శనగర్, డోలపేటల్లో ఒక్కోటి రూ.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, రూ.1.08 కోట్లతో నిర్మించిన సబ్ ట్రెజరీ కార్యాలయ భవనాన్ని, రూ.కోటిన్నరతో నిర్మించిన రాజాం బస్ కాంప్లెక్స్‌ను మంత్రి సోమవారం ప్రారంభించారు. బస్ కాంప్లెక్స్ వద్ద జరిగిన సభలో బొత్స మాట్లాడుతూ సుమారు ఆరు నెలల్లోనే బస్ కాంప్లెక్స్ పూర్తి చేసినందుకు అభినందించారు. త్వరలో రాజాంలో బస్ డిపో కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతిపక్ష నాయకులు తమను, తమ ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించడానికి పరిమితం కాకుండా, ప్రజల కోసం ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడారు. కార్యక్రమాల్లో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, జోనల్ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ తలే రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : గొర్రెలు, మేకల పెంపకం దారులు 699 మందికి రూ.24 లక్షలు విలువైన వలలు, టార్చ్ లైట్లు, రెయిన్ కోట్లను చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ పంపిణీ చేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కొంకడివరం, సీతారాంపురం గ్రామస్తులు

డంపింగ్ యార్డ్ ఏర్పాటును అంగీకరించం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డ్‌ను గరుగుబిల్లి మండలం కొంకడివరం, సీతారాంపురం గ్రామాలకు సమీపాన ఏర్పాటు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రెండు గ్రామాలకు చెందిన ప్రజలు తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పట్టణం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసనను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు కొంకడివరం గ్రామ ప్రధాన రహదారికి 10 మీటర్ల దూరంలో ప్రతిపాదనలు జరుగుతున్నట్లు ప్రకటించారని, దీన్ని తమ రెండు గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్యపై ఈ డంపింగ్ యార్డ్‌ను తరలిస్తున్నారో అదే సమస్యను తమపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని, ఇది చాలా అన్యాయమని అన్నారు. తమ గ్రామం నుండి బాహ్య ప్రపంచానికి రావడానికి ఇదే ప్రధాన మార్గం అని, ముఖ్యంగా కొత్తగా నిర్మించబోయే కలెక్టరు కార్యాలయ సముదాయానికి ఈ ప్రదేశం కేవలం కిలో మీటరు దూరంలో ఉందని అన్నారు. ఈ మూడు గ్రామాల ప్రజల అవసరాల దృష్ట్యా కలెక్టర్ సమస్యను పరిశీలించి తగు న్యాయం చేయాలని కోరారు. అలాగే ఈ సమస్యపై ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని, ఈ స్థలంలో డంపింగ్ చేయడం తప్పనిసరైతే ఈ రెండు గ్రామాల వారిని నిర్వాసిత ప్రాంతాలుగా గుర్తించవలసిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

వాలంటీర్లకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక సచివాలయం-2లో మండలంలోని 5సచివాలయాలకు చెందిన వాలంటీర్లను ఎమ్మెల్యే అలజంగి జోగారావు సన్మానించారు. పెద్దభోగిలి 1, 2, సూరంపేట, గుచ్చిమి జోగింపేట సచివాలయాలకు చెందిన వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల పరిధిలో గల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని 438 మంది వాలంటీర్లను స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను దగ్గర నుంచి పరిశీలిస్తోంది, పార్టీలకు అతీతంగా లబ్దిదారులకు అందిస్తోంది వాలంటీర్లేనని వివ రించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మీరే బ్రాండ్ అంబాసిడర్లని, మీరే ఆత్మీయ బంధువులని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జడ్పిటిసి ప్రతినిధి రాము, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె.సత్యం, కార్యదర్శి ఎటిఎం విజయ కుమారి, సర్పంచులు సుదర్శన్‌రావు, పాపారావు, వినోద్, ఎంపిటిసి బాపయ్య, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వాలంటీర్ల సేవలు గుర్తిస్తూ వారికి వందనం కార్యక్రమం ఎంపిపి శెట్టి శ్యామల నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి సేవలు అందించిన వాలంటీర్లకు సేవారత్న, సేవా మిత్ర అనే బిరుదులతో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్ నాయుడు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎస్.రమేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వాలంటర్లు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీరును సత్కరిస్తున్న పాలకొండ ఎమ్మెల్యే కళావతి

రాయుడుచెరువు ఆక్రమణలు జరగలేదు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువలో రాయుడు చెరువు ఆక్రమణలకు జరగలేదనిపాలకొండ నియోజకవర్గ టిడిపి బాధ్యులు నిమ్మక జయకృష్ణ అసత్య ప్రకటన చేశారని వండవ గ్రామ విశ్వాసరాయి విజయకుమారి, కందుల వెంకటనాయుడుతో పాటు గ్రామ రైతులు అన్నారు. మండలంలోని వండవలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎమ్మెల్యే కళావతి రాయుడు చెరువును ఆక్రమించి రైతులకు ఇబ్బంది పెడుతున్నారని బురద జల్లుతున్నారని, ఇందులో ఎమ్మెల్యేకు ఎటువంటి సంబంధం లేదని అన్నారు. రెవెన్యూ రికార్డులు ప్రకారం సబ్ డివిజన్లో రైతుల పేర్లు మాత్రమే నమోదై ఉన్నాయన్నారు. చెరువులో నీటిని రైతులు వినియోగించుకుని వ్యవసాయం చేసుకుంటున్నట్టు వారు తెలిపారు. వీరఘట్టంలోని కోనేటి చెరువుగట్టు పైన నిర్మాణం చేసిన ఇంట్లో గ్యాస్ కార్యాలయం, టిడిపి కార్యకలాపాలకు వినియోగించడం తప్పు కాదా అని ప్రశ్నించారు. వండవలో ఇనామీ, ఇనామి ఎస్టేట్ భూములకు ఇనామీ దారులు వీరేనని అన్నారు. ప్రజలకు న్యాయం చేసేలా పనులు చేపట్టాలి తప్ప అసత్య ప్రచారాలు చేయరాదని స్పష్టం చేశారు.

ఆశ్రమ పాఠశాల్లో ఎఎన్‌ఎంలను నియమించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు తక్షణ వైద్య సేవలు అందేలా ఎఎన్‌ఎంలను నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.రాజు, హెచ్.సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్లో వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో విద్యార్థులు సరైన వైద్యమందక చనిపోతున్నారని అన్నారు. దీనికి ప్రధాన కారణం తక్షణ వైద్యం కోసం ఎఎన్‌ఎంలు అందుబాటులో లేకపోవడమేనన్నారు. జిల్లాలో 16 మంది విద్యార్థులు సికిల్స్ మియాతో పాటు విష జ్వరాలతో చనిపోతున్న సంగతి విదితమేనన్నారు. కావున విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు ఎఎన్‌ఎంల పోస్టులను భర్తీ చేయడంతో పాటు చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఆశ్రమ పాఠశాలల్లో వసతి గృహాల్లో దోమతెరలు, మెస్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కె.భాస్కరరావు, ఎం.శివకుమార్, ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై దర్యాప్తు నిర్వహించాలి

బెలగాం : మక్కువ మండలం ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థి మృతి పట్ల సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో దాదాపు నలుగురు విద్యార్థులు మృతి చెందినా అధికారులు స్పందించడం లేదన్నారు. విద్యార్థి మృతిపట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్, వార్డును తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. విద్యార్థి తల్లిదండ్రులకు ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, లేనిచో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒకు వినతిని అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎపి భవిష్యత్తు టిడిపి-జనసేనతోనే : బోనెల

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తెలుగుదేశం-జనసేన పార్టీలు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తుకు బాటలని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని కొత్తవలసలో సోమవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో విడుదల చేసిన సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోలా సరిత మధు, నాయకులు, గొట్టాపు వెంకటనాయుడు, మజ్జి వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వంగర, సంధి గూడ, మర్రిగూడ, డోలుకోన గ్రామాల్లో బాబు సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. యువతకు ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు రావాలన్న, ప్రజల కష్టాలు తీరాలన్న రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కె.వెంకట్రావు, యూనిట్ ఇన్చార్జ్ బుజ్జేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, మండల మహిళా అధ్యక్షురాలు నాగ వేణి తదితరులు ఉన్నారు.

6గ్యారంటీలపై అవగాహన కల్పించే బాధ్యత కుటుంబ సారథలే

కురుపాం : తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కుటుంబ సారథులదేననిజిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్ అన్నారు. మండలంలోని మొండెంఖల్‌లో కుటుంబ సారధులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సూపర్ సిక్స్ పథకాలు ప్రజల వద్దకు ఎలా తీసుకెళ్ళి పథకాల ఆవశ్యకత తదితర అంశాలపై సుదీర్ఘంగా వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భగవాన్ మిశ్రా, పి.బలరాం, బెహర వెంకటేశ్వర్లు, ఎం. సుక్కు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలోని కొత్తవలసలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని బూర్జలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీల కోసం వచ్చిన దీర్ఘకాలిక రోగులు, గర్భిణులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య నివేదికలను పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై వారిని అడిగి తెలుసుకొన్నారు. ఆరోగ్య తనిఖీల కోసం శిబిరం వద్దకు వచ్చిన వారికి నిర్ణీత సమయం కేటాయించి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకొని తగు చికిత్స అందజేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కొత్తగా దీర్ఘకాలిక రోగులను గుర్తిస్తే ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉంటే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరపాలని ఆదేశించారు. కదల్లేని స్థితిలో ఉన్న వారి గృహ సందర్శనలు చేసి వారి ఆరోగ్య పరిశీలన చేయాలన్నారు. ఆరోగ్య తనిఖీలు అవసరమైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. అనంతరం అక్కడ మందులు, వైద్య పరికరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రభుతేజ, వైద్య సిబ్బంది నరసమ్మ, వెంకటేష్, 104 సిబ్బంది నవీన్, రాజు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో ఓటుతో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎవరిది అభివృద్ధి పాలనో - ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు బాగా తెలుసునని, బూటకపు ప్రసంగాలు కాదని, దమ్ముంటే వైసిపి నాయకులు అభివృద్ధిపై బహిరంగంగా చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎవరి పాలన స్వర్ణ యుగం, ఎవరి పాలన రాతి యుగమో తేల్చేద్దామని అన్నారు. జగన్‌రెడ్డి సిద్ధమనే సభలు పెట్టి అశుద్ధం మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. 2019లో ప్రజలిచ్చిన ఒక్క ఛాన్స్ తీర్పు జగన్ రాజకీయంగా ఇదే చివరి ఛాన్స్ అని, ఓటమి భయంతో బదిలీలంటూ 77 మందిని జగన్‌రెడ్డి మడత పెట్టాడని, మిగిలిన వారిని కూడా మరో 50 రోజుల్లో జనం మడత పెడతారని అన్నారు. జగన్ పేరు చెబితే అధిక ధరలు, పన్నులు చార్జీల పెంపు అప్పులు, బాదుడు మోసాలు దొంగ ఓట్లు హింస రాజకీయాలు గుర్తుకు వస్తాయని విమర్శించారు. విలేకరుల సమావేశంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేసు, మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, నాయకులు తాడంగి రామారావు ఉన్నారు.

వీరఘట్టం రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు కసితో ఉన్నారని టిడిపి నియోజకవర్గం బాధ్యులు నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం కత్తుల కవిటిలో ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ఎవరిది అభివృద్ధి పాలన, ఎవరిది విధ్వంస పాలన ప్రజలకు తెలుసన్నారు. బూటకపు ప్రసంగాలు కాదు దమ్ముంటే వైసిపి నాయకులు బహిరంగ చర్చలకు రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, అరుకు పార్లమెంటరీ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, తతదితరులు పాల్గొన్నారు.

మైదాన ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీకి వ్యతిరేకం

ప్రజాశక్తి - సాలూరు

విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు సరైన నిర్ణయం కాదని బిజెపి అరుకు ఎంపి ఆశావహ అభ్యర్థి డాక్టర్ హేమానాయక్ అన్నారు. సోమవారం ఆయన పట్టణ బిజెపి నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీని మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేయడం వెనుక కొంతమంది నాయకుల ప్రయోజనాలు వున్నాయని చెప్పారు. గిరిజనులు ఉన్నత విద్యావంతులు కావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే స్థానిక జిల్లా నాయకులు దాన్ని దారి మళ్లించారని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర ఉన్నప్పటికీ గిరిజన యూనివర్సిటీ ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు. తాను ఎంపిగా గెలిస్తే గిరిజన యూనివర్సిటీ ఉన్న మెంటాడ మండలం సాలూరు నియోజకవర్గంలోనే వుండేలా ప్రయత్నిస్తానని చెప్పారు. యూనివర్శిటీ ఫలాలు గిరిజనులకు అందేలా చూస్తామని డాక్టర్ హేమానాయక్ చెప్పారు. కార్యక్రమం లో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ ఆర్.లక్ష్మణరావు, జిల్లా నాయకులు గొర్లి ప్రసాద్,పట్టణ అధ్యక్షుడు పేర్ల విశ్వేశ్వర రావు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతోనే దేశ ప్రగతి

ప్రజాశక్తి - బొబ్బిలి

సాంకేతిక విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని శ్రీలక్ష్మమ్మ మెమోరియల్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ రెడ్డి సత్యారావు అన్నారు. సోమవారం స్థానిక సాయిలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్య పట్ల శ్రద్ధ పెట్టాలని మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

In the Honourable court of the Addtional Junior civil Judge, Parvatipuram
I.A 625/2023 in O.S.No. 136/2022

Between:
1. Bankapalli Ramaswamy .....Plaintiff
And:
1.Mandala Sriramulu
2. Mandala Gowrunaidu,
3.Mandala Simhachalam
4. Miriyala Ganga
5.Dwarapureddi Kaminaidu,
6.Dwarapureddi Suryanarayana
......Defendants

Defendant No6
Dwarapureddi Suryanarayana, S/o Kaminaidu, aged 45 years, Thamarakandi village, Seethanagaram Mandalam, Vizianagaram District.

Where the above named plaintiff has filed a suit for the relief of Specific performance executed by the 1st defendant. You ie. Defendant No.6 is here by summoned to appear in the court in person, or by a pleador to answer all such question on the **1st day of March 2024 at 10-30 AM.** Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determed in your absence,
By order of the Court

Kota Bapooji,
Advocate
Parvathipuram
Parvathipuram,
Date 19-02-2024.